22022025-MAI-04_Layout 1 2/22/2025 2:02 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

అహంకారి పాలనలో అధోగతి

డాక్టర్ దాసోజు శ్రవణ్

"ద్వాపరయుగంలోని దుర్యోధనుడే నేడు కలియుగంలో రేవంత్‌రెడ్డి రూపంలో జన్మించారేమో. అందుకే కౌరవ అగ్రజుడు దుర్యోధనుడికి, రేవంత్‌రెడ్డికి చాలా సారూప్యతలు ఉన్నాయి. దాయాది సోదరులైన పాండవులపై ఈర్ష్య, ద్వేషంతో రగిలిపోయిన దుర్యోధనుడు కురుక్షేత్ర మహాసంగ్రామానికి కారణమయ్యాడు. తను నాశనం అవడమే కాకుండా నూరుగురు సోదరులతో పాటు కురు సామ్రాజ్యాన్ని నాశనం చేశాడు.

దుర్యోధనుడు లాగానే తెలంగాణ సాధకుడు, అభివృద్ధి ప్రదాత కేసీఆర్, ఆయన కుటుంబంపై ఈర్ష్య, ద్వేషం, పగ, ప్రతీకారాలతో నిలువెల్లా రగిలిపోతున్న రేవంత్‌రెడ్డి పాలనను పక్కనపెట్టి కక్ష సాధింపులకు దిగుతున్నారు. తద్వారా తాను నాశనం అవడమే కాకుండా పదేండ్ల సుదీర్ఘ నిరీక్షణ, పోరాటం తర్వాత తెలంగాణలో తొలిసారిగా ఏర్పాటైన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని కూడా నాశనం చేస్తున్నారు. జన్మలో మరోసారి కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాకుండా గట్టి పునాదులు వేస్తున్నారు. పరిపాలనపై పట్టు లేదు, పబ్లిక్ పాలసీపై అవగాహన లేదు, ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే సమర్థత, చిత్తశుద్ధి లేదు, సంపద సృష్టించే తెలివి లేదు. నరనరాన ఈర్ష్య, ద్వేషం, అహంకారం నింపుకొని రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నరు.

రేవంత్‌రెడ్డి తన అసమర్థతను, బీసీల అభ్యున్నతి పట్ల తన చిత్తశుద్ధి లోపాన్ని కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్‌పై అవాకులు, చవాకులు పేలుతున్నారు. జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. కేసీఆర్ కుటుంబం కులగణనలో పాల్గొనకపోవడం వల్లే కులగణనలో తప్పిదాలు జరిగినట్టు కేసీఆర్‌పై దాడి చేయడం హేయం. కేసీఆర్ కులగణనలో పాల్గొంటే వారి సామాజికవర్గం లెక్కల్లోకి వస్తారు. బీసీలకు ఫాయిదా ఏమీ లేదు. అయితే కేసీఆర్ కుటుంబం కులగణనలో పాల్గొనలేదనేది అబద్ధం. కులగణనలో జరిగిన తప్పిదాన్ని ప్రజలు ఎత్తిచూపెట్టడంతో తేలు కుట్టిన దొంగ లెక్క రేవంత్‌రెడ్డి చిన్నపెద్ద తారతమ్యం లేకుండా తండ్రి సమానులైన కేసీఆర్ పైనా, వారి కుటుంబంపైనా, వారి కులంపైనా బూతు పురాణానికి తెగబడ్డారు. బీసీ సామాజికవర్గానికి న్యాయం చేయాలన్న ఆలోచన రేవంత్‌రెడ్డికి అసలు లేదు. అందుకే తప్పుల తడకతో, కాకి లెక్కలతో కులగణన నివేదికను నింపేశారు. తన సొంత సామాజిక వర్గం సంఖ్యను పెంచి లబ్ధి చేకూర్చడానికి రేవంత్ ఈ సర్వేను వాడుకున్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చుని పేర్చిన నివేదిక ఇది. అధికార పార్టీ ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కూడా ఇదే విషయాన్ని ఘంటాపథంగా చెప్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి కుట్ర చేశారని ఆరోపిస్తూ, ఆయనను బీసీలు బహిష్కరించాలని కూడా పిలుపునిస్తున్నారు.

గత పదేండ్లలో బీసీ జనాభా 11 లక్షలు మాత్రమే పెరిగిందని చెప్పడం దేనికి సంకేతం. సమగ్ర కుటుంబ సర్వేలో 56 శాతంగా ఉన్న బీసీలు నేడు 46.25 శాతానికి ఎలా పడిపోయారు. ఓసీల జనాభా 15.79 శాతానికి ఏ ప్రాతిపదికన పెరిగింది? 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83 లక్షల కుటుంబాలు ఉండగా.. 2014లో సమగ్ర కుటుంబ సర్వే నాటికి 1.03 కోట్లకు చేరింది. తాజాగా చేసిన సర్వేలో కుటుంబాల సంఖ్య 1.15 కోట్లుగా తేలింది. అంటే ఈ పదేండ్ల కాలంలో 12 లక్షల కుటుంబాలు మాత్రమే పెరిగాయా?

కులగణనలో 16 లక్షల మంది (3.1 శాతం) సర్వేలో పాల్గొనలేదని ప్రభుత్వమే చెప్తున్నది. అలాంటప్పుడు సర్వేను ఏ ప్రాతిపదికన ప్రామాణికంగా తీసుకోవాలి? 2011లో యూపీఏ సర్కారు చేసిన సామాజిక, ఆర్థిక కులగణనలో సుమారు 1.13 శాతం మంది పాల్గొనలేదని సాకుగా చూపుతూ ఆ వివరాలను వెల్లడించలేదు. కానీ

నేడు 3.1 శాతం ప్రజలు సర్వేలో పాల్గొనకపోయినా కులగణన శాస్త్రీయంగానే జరిగిందని, దేశానికి ఆదర్శమని కాంగ్రెస్ ప్రభుత్వం గప్పాలు కొడుతున్నది.

సర్వేను సమగ్రంగా చేసినట్టు మొదట బుకాయించిన ప్రభుత్వం.. తప్పుల తడకగా ఉన్న సర్వేపై ఇటు బీసీలు, అటు బీఆర్ఎస్ పార్టీ మండిపడటంతో తోకముడిచి తప్పును ఒప్పుకున్నది. బీసీ సంఘాలు, మేధావులు, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ముళ్లకర్ర పట్టుకుని వెనుకనుంచి గుచ్చడంతో ఇప్పుడు మళ్లీ చెంపలు వాయించుకుని రీ సర్వే చేస్తామని చెప్తున్నారు. సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఇతర క్యాబినెట్ మంత్రులు ఎవరూ కులగణనను సీరియస్‌గా తీసుకోలేదు. ఏ ఒక్క జిల్లాలోనూ కనీసం సమావేశాలు, రివ్యూలు నిర్వహించలేదు. ప్రజలను సమాయత్త పరచలేదు. బీసీ సామాజిక వర్గాన్ని తక్కువ చేసి చూపాలనే ఈ కుట్ర ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమే కాదు భారత రాజ్యాంగ శిక్షా స్మృతి ప్రకారం ముమ్మాటికీ నేరమే. కాబట్టి బీసీలపై రేవంత్ ప్రభుత్వం చేసిన కుట్రపై సీబీఐ విచారణ జరిపించాలి. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కన్వర్టెడ్ బీసీ అని రేవంత్‌రెడ్డి చెప్పడం వ్యర్థ ప్రేలాపన. రేవంత్ అన్నట్టు మోదీ బీసీగా మారినందువల్లే కుల గణనను తిరస్కరించింది నిజమే అయితే, రేవంత్ తాను స్వతహాగా ఫ్యూడల్ కాబట్టి, కులగణనను తారుమారు చేసిండా?

రేవంత్‌రెడ్డి ముందుగా చట్టాల గురించి తెలుసుకోవాలి. కులాల ప్రస్థానం, సామాజిక పరివర్తనం గురించి ఆయనకు ఏమాత్రం అవగాహన లేదని అర్థమవుతున్నది. Identification is different from conversion. BC's are identified, not converted. బీసీల గుర్తింపునకు సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఆర్టికల్స్ 15(4), 16లను పొందుపరిచారు. అంతే కాదు ఆర్టికల్ 340 ప్రకారం బీసీల సామాజిక, విద్యాపరమైన స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిషన్లను కూడా నియమించవచ్చు. ఈ విధంగా రాజ్యాంగబద్ధంగా 1953లో కాలేల్కర్ నేతృత్వంలో తొలి బీసీ కమిషన్ ఏర్పాటు అయింది. 1955లో కాలేల్కర్ సమర్పించిన నివేదికలో 2,399 సామాజిక వర్గాలను బీసీ కులాలుగా గుర్తించారు. ఆ తర్వాత 1978లో అప్పటి మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం మండల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 1980లో సమర్పించిన మండల్ నివేదికలో 3,743 సామాజిక వర్గాలను బీసీ కులాలుగా గుర్తించారు. దేశ జనాభాలో సుమారుగా 52 శాతం మంది బీసీలు ఉన్నట్టు ఆ కమిషన్ తేల్చింది. నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్ (అ) 2006 నివేదిక ప్రకారం దేశంలో 5,013 బీసీ కులాలు ఉన్నాయి. రేవంత్‌రెడ్డి చెప్తున్న ప్రకారం పెరిగిన ఈ కులాలన్నీ కన్వర్టెడా?

తెలంగాణ ఏర్పాటు అయ్యాక రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనల మేరకు ఉమ్మడి ఏపీలో ఉన్న 138 బీసీ కులాల నుంచి తెలంగాణలో లేనటువంటి గుడియా, పోలినాటి వెలమ, తూర్పు కాపు, గాజుల కాపు, అతిరస తదితర సామాజికవర్గాలను తొలగించి 112 సామాజిక వర్గాలను తెలంగాణ బీసీ కులాలుగా జస్టిస్ ఈశ్వరయ్య నేతృత్వంలోని ఎన్‌సీబీసీ గుర్తించింది. గ్రూప్ 'డి' నుంచి 'బి'కి, 'బి' నుంచి 'ఏ'కి.. ఇలా అంతర్గత మార్పుల కోసం కూడా పలు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇది దేశంలో జరిగే సామాజిక పరివర్తన తప్ప కన్వర్టెడ్ కాదు? కాబట్టి రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బీసీలకు క్షమాపణలు చెప్పాలి.

రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన కులగణన సర్వేను సొంత పార్టీ నేతలతో పాటు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కూడా తప్పుబట్టారు. సర్వేలో తప్పుడు సమాచారం ఇచ్చే వారిపై, తప్పుడు డాటా నివేదించే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గతంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. మరిప్పుడు తప్పుడు నివేదిక తయారు చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆయన ఎందుకు క్రిమినల్ కేసు నమోదు చేయడం లేదు? తెలంగాణ ప్రయోజనాల నుంచి బీసీ రిజర్వేషన్ల వరకు ఏ అంశంలోనూ మోదీతో రేవంత్‌రెడ్డి ఫైట్ చేయలేరు. మోదీతో రేవంత్ ఎప్పుడో కుమ్మక్కయ్యారు. ఈ విషయాలను గ్రహించిన రాహుల్‌గాంధీ తాజాగా రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీని తప్పించి, పార్టీకి నమ్మకస్తురాలైన, నిజాయతీకి మారు పేరైన మీనాక్షి నటరాజన్‌కు రాష్ట్ర ఇంచార్జి బాధ్యతలను అప్పగించారు. ''No matter how capable a leader is, governing a clan of incompetence and corruption is like steering a ship where the crew is busy drilling holes'' అలాగే నిజాయతీకి మారుపేరైన మీనాక్షి నటరాజన్ ముఖ్యమంత్రి, ఆయన సహచర వర్గంపై వ్యతిరేకత నేపథ్యంలో అవినీతికి ఏమేరకు అడ్డుకట్ట వేస్తారో, బీసీలకు ఏ విధంగా న్యాయం చేస్తారో చూడాలి.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ నాయకులు)

అంధకారానికి అభివృద్ధి ముసుగు

అమెరికా ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య ఎంత దారుణమో, భారత ఏలికలు చూపిస్తున్న వైఖరి అంతకన్నా అధ్వాన్నమైనది. ఈ ఘోర పరిస్థితిపై అధికార పార్టీ ఒక్కమాట కూడా మాట్లాడట్లేదు. అమెరికాలో అక్రమంగా అడుగుపెట్టిన మనవాళ్లను క్రిమినల్స్‌లా శిక్షిస్తుంటే, మేమేం చేయగలమనే భావంలో ప్రభుత్వ నాయకత్వం ఊరుకొని కూర్చుంటున్నది. ఇదే వాళ్లకు ఓట్లడిగే సమయం అయితే, విదేశాల్లో భారతీయుల మనోభావాలు గౌరవించాలంటూ మోకాలితోడూ లొంగిపోయేవాళ్లు ఇప్పుడు ఎందుకు మౌనం దాలుస్తున్నారు?

ఈ స్థితికి కారణం మన పాలకులే. Make in India, Start-up India, Digital India వంటి వందల కొద్దీ నినాదాలు రావచ్చు, కానీ వాటి అమలులో కనిపించే శూన్యత కారణంగా యువత దేశంలో భద్రత, భవిష్యత్తు కోసం ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రోజురోజుకు నిరుద్యోగం పెరుగుతున్నది. మధ్య తరగతి కుటుంబాలకు మినిమమ్ లైఫ్ స్టాండర్డ్స్ కూడా దొరకడం లేదు. భారతదేశం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందుతున్నదో చెప్పుకొంటున్నాం, కానీ, అదే సమయంలో మనం ఎదుగుతున్న దేశమా, లేక వెనకబడిపోతున్నామా అనే ప్రశ్నను కూడా ఎదుర్కోవాల్సిన అవసరం ఉన్నది. నేడు మన విద్యా వ్యవస్థ దిగజారిపోయింది. లక్షల మంది ఇంజినీర్లు, గ్రాడ్యుయేట్లు విద్యను పూర్తిచేసినా, తగిన ఉద్యోగాలు దొరకడం లేదు. ప్రభుత్వరంగంలో అవకాశాలు తక్కువైపోయాయి. ప్రైవేట్‌రంగంలో ఉద్యోగ భద్రత గల్లంతైంది. కార్పొరేట్ కంపెనీలు తమ లాభాల కోసం మానవ వనరులను నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత యువతకు దేశంలో భవిష్యత్తు ఉన్నదనే నమ్మకం ఎలా కలుగుతుంది?

మూర్ఖత్వం పెరుగుతూ, ప్రశ్నించే ధైర్యం తగ్గిపోతున్నది. విదేశాలకు వెళ్లి బాగుపడాలనే ఆశను మన ప్రభుత్వం, రాజకీయ నాయకులు చూసే విధానం మరింత దిగజార్చింది. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బదులు, మూఢ నమ్మకాలను పెంచే విధంగా వ్యవహరిస్తున్నారు. గుడ్డి భక్తిని పెంచేవిధంగా ప్రజలను మభ్యపెడుతున్నారు. రాజకీయ నాయకులు, నటులు, వ్యాపారవేత్తలను భక్తిపూర్వకంగా చూసే మానసిక ధోరణి ప్రజల్లో పెరిగిపోయింది. పాలకులను ప్రశ్నిస్తే, దేశద్రోహి అనే ముద్ర వేసే పరిస్థితి వచ్చేసింది. మన రాజ్యాంగం ఇచ్చిన ప్రశ్నించే హక్కు పూర్తిగా హరించబడింది. ఆర్థిక విధానం, ప్రభుత్వంలో అవినీతి, మతంపై చేస్తున్న అకృత్యాల లాంటి ప్రశ్నలు ఎవరైనా అడిగితే, పాలకులకు టార్గెట్ అవ్వాల్సిన పరిస్థితి. ఇంతటి తీవ్రమైన మూర్ఖత్వం, అంధభక్తి ప్రజాస్వామ్యానికి చుట్టూ వేసిన గొంగళిపురుగులా మారింది.

సెలబ్రిటీ వర్షిప్, మత మౌఢ్యం అనే ముసుగు భారత్‌ను వెనక్కి నెడుతున్నది. దేశాభివృద్ధికి ప్రభుత్వ పాలన, సామాజిక చైతన్యం రెండు ముఖ్యమైన శక్తులు. కానీ, ఈ రెండింటిని ప్రస్తుత భారత రాజకీయాలు పూర్తిగా నాశనం చేశాయి. నేటి పాలకులు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజల మూర్ఖత్వాన్ని, మత మౌఢ్యాన్ని వినియోగించుకుంటున్నారు. రాజకీయ నాయకులంటే దేవుళ్లలా మారిపోయే స్థాయికి ప్రజలు దిగజారిపోయారు. తాము ఓటు వేసి అధికారంలోకి తెచ్చిన వాళ్లను ప్రశ్నించాల్సిన ప్రజలే, ఆ నాయకులను పొగిడేందుకు, సమర్థించేందుకు ఉరకలేస్తున్నారు.

భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదని చెప్పుకోవడానికి ఎన్నికలు జరుగుతున్నాయనేది ఒకటే కారణం. కానీ, ప్రజలు నిజమైన సమస్యల గురించి చర్చించకుండా, తమ పార్టీ నాయకుడిని ఎంత పెద్ద గొప్ప మనిషిగా చూపించగలరో, అంత శక్తినీ, సమయాన్నీ ఉపయోగిస్తున్నారు. మత పరమైన హింస, కులవివక్ష, ప్రాంతీయ అసహనం పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం మారినంత మాత్రాన పరిస్థితి మారడం లేదు, మారదు, మారబోదు. భారతదేశంలో నిజమైన మార్పు రావాలంటే, ప్రజల ఆలోచనా ధోరణి మారాలి. ప్రజలను పాలకులు మోసం చేస్తున్నారు, వాళ్ల హక్కులను హరిస్తున్నారు, మూర్ఖత్వంలో పడేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గుర్తించాలి. ప్రభుత్వం తప్పు చేస్తే ప్రశ్నించాలి. గుడ్డిగా నాయకులను సమర్థించే ధోరణిని మానుకోవాలి. అభివృద్ధి నినాదాలు, పెద్ద పెద్ద ప్రాజెక్టుల ప్రకటనలు మన దేశ యువతకు నిజమైన భవిష్యత్తును అందించలేవు. జనాలు మారేదాకా ప్రభుత్వం మారదు, ప్రభుత్వం మారేదాకా ప్రజల పరిస్థితులు మారవు! మన బాధ్యత మనమే నిర్వహించాలి. ప్రశ్నించండి, ఆలోచించండి, మార్పును కోరండి.

- కాసర్ల నాగేందర్ రెడ్డి

ఆత్మ 'హత్య'ల తెలంగాణ

ఉమ్మడి పాలనలో తెలంగాణ వెతలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా రైతాంగం పడ్డ బాధలు వర్ణనాతీతం. దగా పడ్డ తెలంగాణలో నాడు పల్లెకో బోర్ల రామిరెడ్డి, ఊరికో ఉరికొయ్యలకు వేలాడే రైతన్న ఉండేవాడు. తెలంగాణలో నాడు పాడువడ్డ ఊర్లు, పడావువడ్డ పొలాలు తప్ప ఇంకేమీ కానరాని దుస్థితి. ఈ ప్రాంతం మరో బోర్ల రామిరెడ్డిని చూడకూడదని, రాష్ట్రంలో ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోకూడదని గట్టిగా సంకల్పించుకున్న కేసీఆర్.. తెలంగాణ వచ్చాక అనేక పథకాలను రచించి రైతును రాజును చేశారు. కానీ, ఏడాది తిరగక ముందే కాంగ్రెస్ పాలనలో మళ్లీ ఆత్మహత్యలు ప్రారంభమయ్యాయి.

మలిదశ ఉద్యమ జెండా ఎత్తుకున్న కేసీఆర్.. ఊరూరా తిరిగి తెలంగాణ గడ్డ ఎదుర్కొంటున్న బాధలు, తెలంగాణ రైతు బిడ్డ గాథలను కండ్లారా చూశారు. అందుకే ప్రజలు ఆయనను తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. రైతన్నకు వెన్నుదన్నుగా నిలవాలన్న సంకల్పంతో స్పష్టమైన ప్రణాళికలతో, విస్పష్టమైన విధివిధానాలతో బృహత్తర ప్రణాళికలు, పథకాలను రచించారు. మేధావులతో మంతనాలు, నిపుణులతో చర్చల తర్వాత ఎంతో మేధోమథనం చేసి రైతన్నకు కావలసినవి సమకూర్చారు. 24 గంటల నిరంతర, నాణ్యమైన విద్యుత్తును అందించారు. ఆ తర్వాత రైతుబంధు పథకాన్ని అమలుచేసి పెట్టుబడి వెతలు తీర్చారు. కేసీఆర్ సర్కార్ అమలుచేసిన పథకాలు, విధానాల ఫలితంగా తెలంగాణ రైతాంగం పుట్లకు పుట్లు పండించింది. ఏ ఇంట చూసినా సిరుల పంట పండింది. తత్ఫలితంగా తెలంగాణలో అన్నదాతల ఆత్మహత్యలు నిలిచిపోయాయి.

సల్లగా ఉంటే కన్ను కుట్టే కాంగ్రెస్‌కు తెలంగాణను చూశాక కండ్లు మండాయి. ఎలాగైనా తెలంగాణను నాశనం చేయాలని కంకణం కట్టుకున్నది. అందుకే, మార్పు పేరిట ఏమార్చింది. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణ రైతుల జీవితాల్లో నిజంగానే మార్పు తీసుకువచ్చింది. అధికారంతో పాటే కరువును వెంట తీసుకొచ్చిన కాంగ్రెస్.. తెలంగాణను శాశ్వత కరువు ప్రాంతంగా మార్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నది. రైతాంగంపై కక్షగట్టిన రేవంత్ సర్కార్ తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరాన్ని ఎండబెట్టి వ్యవసాయాన్ని పండబెట్టింది. కేసీఆర్‌పై అక్కసుతో కాళేశ్వరం నీటిని సముద్రం పాలు చేసింది. దీంతో ఇప్పుడు నీళ్లు లేక డ్యామ్‌లు, ప్రాజెక్టులు అడుగంటాయి. పొలాలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే రైతుబంధు రాక, పెట్టుబడులు లేక ప్రైవేట్ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకున్న రైతాంగం తిప్పలు పడుతున్నది. పంట చేతికొచ్చే అవకాశం లేకపోవడంతో దిక్కుతోచక ఉరికొయ్యలకు వేలాడుతున్నది. మట్టిని నమ్ముకొని తాను జీవించడమే కాకుండా, నలుగురికి అన్నం పెట్టే రైతన్న తినడానికి తిండి లేక అలమటించే పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ పాలనలో రోజుకొకరి చొప్పున ఇప్పటికే 430 మంది రైతులు మరణించారు.

కాంగ్రెస్ సర్కారు విధానాల వల్ల తెలంగాణ మరోసారి ఆత్మహత్యలకు వేదికగా మారుతున్నది. రైతాంగంతో పాటు హస్తం పార్టీ చేతిలో చితికిపోయిన నేతన్నలు కూడా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఉచిత బస్సుల చక్రాల కింద నలిగిపోయిన ఆటో అన్నలు ఆత్మహత్యలే శరణ్యమంటూ తనువు చాలిస్తున్నారు. పంటలు పండక రైతన్నలు, కిరాయిలు లేక ఆటో డ్రైవర్లు, చేతిలో పనులు లేక నేతన్నలు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, జీతాలు రాక ఉద్యోగులు, స్కాలర్‌షిప్, ఫీజు రీ యింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొనడంతో బిల్డర్లు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలా రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు నిత్యం మండుతూనే ఉన్నాయి. రేవంత్‌రెడ్డి తన ఏడాది పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్ఠంలా మార్చారు. ఆత్మహత్యలను మరిచిపోయిన తెలంగాణను మళ్లీ బలిపీఠంగా మార్చా రు. తెలంగాణను ఆత్మహత్యలకు నిలయంగా మార్చడమే తమ విధానంగా, రైతన్నలు ఆత్మబలిదానాలు చేసుకునేలా చేయడమే తమ నినాదంగా, అన్నివర్గాల ప్రజలు తనువు చాలించేలా ఉరికొయ్యలకు మార్గం చూపడమే తమ ప్రణాళికగా పాలన సాగిస్తున్న కర్కశ ప్రభుత్వం ఇంకా ఎంత మందిని బలి తీసుకుంటుందో?

- అనిల్ కూర్మాచలం, (వ్యాసకర్త: ఎఫ్డీసీ మాజీ చైర్మన్)

"దేశ జనాభాలో 50 శాతానికి పైగా బీసీలున్నప్పటికీ, 75 ఏండ్ల స్వతంత్ర భారత చరిత్రలో వారికోసం ఒక మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయలేదు. బీసీలకు ఒక మంత్రిత్వశాఖ ఉంటే వారి సంక్షేమం పట్ల, సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి ఉంటుందని, పరిష్కారానికి అధికారిక వేదిక అవుతుందని బీఆర్ఎస్ మొదటి నుంచీ భావిస్తున్నది. అందుకే, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నపుడు కేంద్రంలో బీసీ సంక్షేమ మంత్రిత్వశాఖ అవసరాన్ని కేంద్రానికి పలుమార్లు గుర్తు చేయడమే కాకుండా బీసీ మంత్రిత్వశాఖకు డిమాండ్ చేశారు.

బీసీలంటే అంత చులకనా?

గోపాల బాలరాజు
7337082570

తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే కేసీఆర్ ప్రభుత్వం బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటుకు ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. అయినప్పటికీ కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దేశంలో వెనుకబడిన వర్గాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రయోజనాలు వారికి లభించడం లేదు. బీసీ కులాలకు సంబంధించి కచ్చితమైన గణాంకాలు లేకపోవడమే ఇందుకు ఒక కారణం. ప్రణాళిక లేని గణాంకాలతో, గణాంకాలు లేని ప్రణాళికలతో ప్రయోజనం ఉండదని అంటారు 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ స్టాటిస్టిక్స్'గా పేరుగాంచిన మహాలనోబిస్.

1953లో ఏర్పాటు చేసిన కాలేల్కర్ కమిషన్, ఆ తర్వాత వచ్చిన అనేక కమిషన్లు బీసీ వర్గాల జనగణనకు సిఫారసు చేశాయి, భారత తొలి ప్రధాని నెహ్రూ నుంచి, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం వరకు ఎవరి ప్రభుత్వమూ ఆయా కమిషన్ల సిఫారసులను పట్టించుకోలేదు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు న్యాయం జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే తగిన వివరాలు లేకుండా ఏ వర్గాన్నయినా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు ఎలా రచిస్తారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పిన మాట ఆలోచింపదగినది. కచ్చితమైన గణాంకాల ప్రాతిపదికగా ప్రణాళికా రచన, విధాన నిర్ణయాలు జరగాలనేది ప్రాథమిక అవగాహన. అందుకే తెలంగాణ ఏర్పడిన వెంటనే సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా ఒకే ఒక్క రోజులోనే నిర్వహించారు. అభివృద్ధి ఫలాల పంపిణీలో జరిగే అవకతవకలన్నింటికీ నిర్దిష్టమైన గణాంకాలు లేకపోవడమే ప్రధాన కారణమని కేసీఆర్ పదే పదే అంటుంటారు. సామాజిక గణాంకాల ఆవశ్యకత, అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రాధాన్యం తెలిసిన నాయకుడు కావడం వల్లే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. నేడు దేశంలో ఒక్క తెలంగాణలో మాత్రమే నిర్దిష్టమైన, సమగ్రమైన, స్పష్టమైన గణాంకాలు అందుబాటులో ఉన్నాయనడం అతిశయోక్తి కాదు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా సేకరించిన గణాంకాల ప్రాతిపదికగా ప్రణాళికలు రూపొందించడం వల్లనే కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లుగా అట్టడుగుస్థాయి వరకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను సక్రమంగా అందించగలిగింది.

బీసీల వివరాల సేకరణ విషయంలో గతేడాది సుప్రీంకోర్టు ముందు కేంద్ర ప్రభుత్వం తన అశక్తతను వ్యక్తం చేసింది. 2011 నాటి జనగణన సందర్భంగా సేకరించిన బీసీల వివరాలు తప్పుల తడకగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఇక ముందు ఈ వివరాలను సేకరించలేమని కేంద్రం తన అఫిడవిట్‌లో తెలిపింది. బ్రిటిష్ హయాంలో మన దేశంలో కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించారు. ఇప్పటికీ అవే లెక్కలపై ఉజ్జాయింపుగా ఆధారపడటం ఆశ్చర్యం. పరాయి పాలకుల స్థాయిలో కూడా మనం వివరాలు సేకరించుకోలేమా? ఈ కీలకమైన అంశంపై బీజేపీ ఎన్నికల ముందు ఒకతీరు, తర్వాత మరో తీరుగా మాట మార్చడం గర్హనీయం.

కులాల వివరాలు సేకరిస్తే వైషమ్యాలు పెరుగుతాయనేది అర్థం లేని వాదన. సామాజిక అంతరాలు తొలగించి, సామరస్యం సాధించడంలో ప్రభుత్వాలు విఫలమైనప్పుడే వైషమ్యాలు చోటు చేసుకుంటాయి. అంతే గానీ గణాంకాలు సేకరించడం వల్ల కాదు. జనగణన అంటే అడవిలో జంతువులను లెక్కించినట్టు కాదు. ప్రజల సమగ్ర వివరాలు విధానకర్తలకు, సామాజిక పరిశోధకులకు ఉపయోగపడాలి. ఏయే ప్రాంతాల్లో, ఏయే వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉన్నదో తెలువకుండా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడమంటే చీకట్లో బాణం వేసినట్టే ఉంటుంది. సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలున్న మన సమాజంలో గణాంకాలకు మరింత ప్రాధాన్యం ఉంటుంది.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జరిపిన కులగణన సర్వేలో బీసీ వర్గాల జనాభాతోపాటు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల జనాభాను కూడా తక్కువగా చూపించి అన్యాయం చేశారని, సర్వే అంతా తప్పుల తడకగా ఉన్నదని కాంగ్రెస్ పార్టీ వారే కాకుండా, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. బీసీ వర్గాల జనగణనను కేంద్రం అధికారికంగా జరపనంత వరకు బీసీ వర్గాలకు ఇలాగే తీరని అన్యాయం జరుగుతూనే ఉంటుంది. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కండ్లు తెరిచి, తక్షణమే బీసీ వర్గాల జనగణనను చేపట్టి, కేంద్రంలో బీసీలకు ప్రత్యేకంగా సంక్షేమ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది.



ఇలాగైతే ఆర్టీసీ ఆగమే

ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, 75 ఏండ్లు దాటిన వారికి ఇస్తున్న రాయితీలతో ఆర్టీసీకి రోజుకు రూ. 3 కోట్ల నష్టం వస్తున్నది. ఇలాంటి పర